ఐటీఐలో కొత్త కోర్సులు

- అప్రెంటిస్, జాబ్ మేళాతో ఉద్యోగ అవకాశాలు
- అందుబాటులోకి ఆరు కొత్త కోర్సులు
- విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



ప్రభుత్వ ఐటీఐ కళాశాల

మహబూబాబాద్ అర్బన్: ఐటీఐ కళాశాలల్లో కోర్సులు విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్య శిక్షణ అందిస్తాయి. విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధికి దోహదం చేస్తున్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలల్లో పరికరాలు, మౌలిక వసతులతో ఆధునీకరిస్తున్నారు. ఐటీఐ కోర్సులతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలో ఒక ప్రభుత్వ కళాశాల, సుమారు 7 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. 8 ఐటీఐ కళాశాలలో మొత్తం సుమారు 1450 సీట్లు ఉన్నాయి. కాగా 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులు

ఐటీఐ అడ్వాన్స్ టెక్నాలజీ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేయడానికి ఈ నూతన కోర్సులను ప్రారంభిస్తున్నారు. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ మెకానికల్(రెండేళ్ల కోర్సు), అడ్వాన్స్ సీఎస్‌సీ మిషన్ టెక్నీషియన్(రెండేళ్ల కోర్సు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్(రెండేళ్ల కోర్సు), మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్(ఒక సంవత్సరం), ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఒక సంవత్సరం), ఆర్టిజన్స్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్(ఒక సంవత్సరం కాల పరిమితి). ఆసక్తి ఉన్న విద్యార్థులు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులకు అన్ని కోర్సుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు.

ఉద్యోగ అవకాశాలు..



ఐటీఐ కోర్సులు పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయి. స్వయం ఉపాధి కూడా పొందవచ్చు. ఐటీఐ కోర్సు రెండు సంవత్సరాలు పూర్తి చేసిన విద్యార్థులు పాలిసెట్‌లో డిప్లొమా కోర్సులో నేరుగా రెండో సంవత్సరంలో చేరేందుకు అర్హులు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– వి.రాధాకృష్ణ, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో గల లక్ష్మీవెంకటేశ్వరస్వామివారి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నామిరెడ్డి జాయింట్ ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ నామిరెడ్డి హేమేంద్రదేవి, సీతారాంరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు తాటిపాముల దుర్గాప్రసాద్, మారేపల్లి కౌశిక్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రతిభ



మహబూబాబాద్ అర్బన్: జూన్ 27నుంచి 30 వరకు కామారెడ్డి జిల్లాలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ యూత్ క్యాంపులో జిల్లా కేంద్రంలో నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని ప్రతిభ చాటారని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మమత అన్నారు. మంగళవారం వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌లో ప్రోగ్రాం అధికారులు వెంకటేశ్వర్లు, రత్నమాల, అధ్యాపకులు యుగంధర్, వేణుగోపాల్, మల్లేశం, సుజిత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, కాసిం, సమాన్, పీడీ శశికాంత్ పాల్గొన్నారు.

ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక

గంగారం: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ వార్షిక సోషల్ ఆడిట్ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. గ్రామాల వారీగా పనుల వివరాలను చదివి వినిపించారు. ఏపీడీ శాంతకుమారి, ఆర్ఎం అంబుర్స్ మెన్‌లు హాజరై వార్షిక నివేదిక రికవరీలు రాశారు. కార్యక్రమంలో ఎస్‌డీఎం కోఆర్డినేటర్ రవికుమార్, ఎంపీడీఓ అప్పారావు, ఏపీఓ హరికృష్ణ, టీఏలు రవి, శరత్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

కురవి: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గంధసిరి జ్యోతిబసు, వీరేందర్, శరత్, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

మరిపెడ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ బిందుశ్రీ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ గుగులోతు రవి, డాక్టర్ స్వామి, వైద్య బృందం శాంతారాణి, కృష్ణ, వెంకటేశ్వర్లు, సుదర్శన్, శోభ, అఖిల, ఉపేంద్ర, సిరి, ఝాన్సీ, సతీష్, సాయిశ్రీ, తరణి పాల్గొన్నారు.

గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థి

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల నుంచి విద్యార్థి తప్పించుకున్న సంఘటన మంగళవారం సోషల్ మీడియాలో వైరలవుతోంది. వివరాలు.. నెల్లికుదురు మండలం నైనాల గ్రామానికి చెందిన గిరిశెట్టి అశోక్, శోభల కుమారుడు సతీష్ మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సతీష్ మంగళవారం ఉదయం గురుకులం నుంచి పారిపోయాడు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. దీంతో తల్లిదండ్రులు వెతకగా నెల్లికుదురు మండలం రామన్నగూడెం క్రాస్‌రోడ్డు వద్ద కనిపించాడు. విద్యార్థులపై హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే ఎలా అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థికి గురుకులంలో ఉండడం ఇష్టం లేకనే తప్పించుకొని పోయాడని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపాడు.

నూతన కమిటీ ఎన్నిక

డోర్నకల్: స్థానిక బ్యాంక్‌స్ట్రీట్ పాతవేంకటేశ్వరాయలంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం మండల కమిటీని నియమించారు. మండల అధ్యక్షుడిగా చిత్తలూరి వీరభద్రం, ప్రధాన కార్యదర్శిగా జంపాల వీరబాబు, ఉపాధ్యక్షుడిగా దడిగల రవి, గౌరవాధ్యక్షుడిగా పగిడిపాల వెంకటేశ్వర్లు, సలహాదారుగా కొప్పుల వెంకట్, కార్యవర్గ సభ్యులుగా జంపాల ప్రభాకర్, జంపాల నర్సయ్య, జంపాల శ్రీను, రమేష్, ఉపేందర్, శ్రీను నియమితులయ్యారు.

ఆత్మహత్యాయత్నంపై డీజీపీ స్పందించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఖమ్మం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీఐ, ఇతర సిబ్బంది, కారకులపై చర్య తీసుకోవాలని జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సంఘం నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ఎస్సై ఆత్మహత్యయత్నంపై తక్షణమే డీజీపీ స్పందించి సంఘటనపై విచారణ జరిపించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జం ఐలయ్య, బూడిద నాగరాజు, కందకూరి వెంకటాద్రి, భరత్, జానీ, తిరుపతి, రామకృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీస్ మిత్రులు


ఎస్పీ చేతుల మీదుగా డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్: లారీలోని కర్రలు మీదపడి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ కానిస్టేబుల్ కుటుంబానికి మిత్రులైన పోలీసు సిబ్బంది ఆర్థిక చేయూతనందించి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో కొద్ది రోజుల క్రితం లారీలోని కర్రలు మీదపడి రోడ్డు ప్రమాదంలో పోలీసు కానిస్టేబుల్ ధనసరి పాపారావు మృతి చెందాడు. పాపారావు మిత్రులు 2018 బ్యాచ్‌కు చెందిన పోలీసు సిబ్బంది కలిసి రూ.2.25లక్షల విలువ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను మంగళవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి


సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడానికి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఏఐఎస్ఎఫ్‌బీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో మంగళవారం ఏఐఎస్ఎఫ్‌బీ ఆధ్వర్యంలో విద్యా సంస్థల్లో అధిక ఫీజుల దోపిడీలను అరికట్టాలని సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా రోహిత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా హక్కు అమలు చేయడంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారుల వైఫల్యం చెందారని, 2009 ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేద మధ్య తరగతి విద్యార్థులకు 25శాతం ఉచిత విద్యను అందించాలన్నారు. తక్షణమే విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, రాజు,సురేష్, మహేష్, బాబు, శ్రీను పాల్గొన్నారు.

ప్రతీ సాగు భూమికి 'రైతు భరోసా' ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

నెల్లికుదురు: రైతు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా అందించాలని సొసైటీ చైర్మన్లు కాసం లక్ష్మిచంద్రశేఖరరెడ్డి, గుండ వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని చిన్నముప్పారం, నెల్లికుదురు రైతువేదికల్లో మంగళవారం ప్రభుత్వ ఆదేశాలలో సొసైటీ సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతుల సలహాలు, సూచనల కోసం ప్రత్యేక జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. అనంతరం చైర్మన్లు మాట్లాడుతూ.. గుట్టలకు, బొందల గడ్డలకు, చెరువులు, కుంటలు మినహా రైతు సాగు చేసుకుంటున్న ప్రతి ఎకరాకు రైతుభరోసా ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వెన్నాకుల వాణి శ్రీనివాస్, డీఏఓ శోభన్‌బాబు, ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, ఏఈఓ ప్రవీన్, సీఈఓ యాదగిరి సొసైటీ డైరెక్టర్లు , రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

యువకుడి అనుమానాస్పద మృతి

బయ్యారం: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని లక్ష్మీనరసింహపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వంగూరి మురళీ(22) మూడు రోజులుగా ఇంటి నుంచి ఇంటికి రాలేదు. అతని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో ఇంటి సమీపంలోని చెట్ల పొదల్లో ఉరివేసుకుని ఉన్న మృతదేహం కనపడింది. తమ కుమారుడిని ఎవరో హతమార్చి ఉరివేసినట్లు మృతుడి తల్లి ఎల్లమ్మ ఆరోపించింది. సంఘటన స్థలాన్ని గార్లబయ్యారం సీఐ రవికుమార్ సందర్శించి మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్త సెక్షన్ కింద కేసు నమోదు

గూడూరు: కొత్త నేర చట్టాలు మూడు అమల్లోకి వచ్చి రెండు రోజు లైంది. అందులో భాగంగా మంగళవారం గూడూరు పోలీసు స్టేషన్‌లో బీఎన్ఎస్ కింద మొదటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్. నగేష్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని తేజావత్‌రాంసింగ్‌తండా శివారు నల్లబోడుతండాకు చెందిన జర్పుల సోమ (38) అదే గ్రామానికి చెందిన భూక్య శ్రీనివాస్ వద్ద కొంత అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చమని సోమను శ్రీనివాస్ ఇబ్బందుకుల గురి చేశాడు. అవమానంతో భూక్య సోమ పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, కారకులను శిక్షించాలంటూ తండావాసులు మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై నగేష్ చేరుకొని జరిగిన సంఘటన ఫిర్యాదు మేరకు కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చాడు. దీంతో మంగళవారం మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

మహిళపై అసభ్యకర ప్రవర్తన.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ మండలానికి చెందిన పస్కం మహేష్ అనే వ్యక్తి జాతకాలు చెబుతానని అంటూ ఊరూరా తిరుగుతుంటాడు. ఈ క్రమంలో అతడు మండలంలోని ఓ గ్రామానికి వెళ్లి ఓ ఇంట్లో జాతకం చెప్పే క్రమంలో ఆ ఇంటికి చెందిన మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నూతన చట్టాల అమలులో భాగంగా సెక్షన్ 74 బీఎన్ఎస్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

మొక్కలు నాటాలి

దంతాలపల్లి: మొక్కలు పెంచడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో ఖమ్మం, వరంగల్ జాతీయ రహదారి పక్కన మంగళవారం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ఐ నజీముద్దీన్, కార్యదర్శి లక్ష్మికాంత్, ఫీల్డ్‌అసిస్టెంట్ మార్క వెంకన్న పాల్గొన్నారు.

సీత్లా పండుగను వైభవంగా జరుపుకోవాలి

నెహ్రూసెంటర్: గోర్ బంజారాల సీత్లా పండుగను జూలై 9న ఒకే రోజున జరుపుకుని జాతి ఐక్యతను చాటి చెప్పాలని డాక్టర్ నెహ్రూరాథోడ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సేవాలాల్ సేన సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూరాథోడ్ మాట్లాడారు. ఈ సమావేశంలో సేవాలాల్ వెంకన్ననాయక్, మోతిలాల్, నందులాల్, పద్మాబాయి, స్రవంతి, లక్ష్మీబాయి, దేవి పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

కురవి: ప్రజలు శాంతియుతంగా ఉండాలని, ఘర్షణ పూరిత వాతావరణం ఉండకూడదని కురవి ఎస్సై బైరు గోపి సూచించారు. మంగళవారం రాత్రి మండల కేంద్రం శివారు రేకుల తండా గ్రామంలో ప్రజలకు నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు.

సమాజ మార్పు కోసం పనిచేయాలి

- ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్


కురవి: ఎంపీపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, సమాజ మార్పు కోసం పనిచేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీలు, ఎంపీపీ వీడ్కోలు సమావేశం ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవి నాయక్ అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ దంపతులను ఆయన సత్కరించారు. కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణను అప్పులపాలు చేసిందని విమర్శించారు. బీసీ గణన తర్వాత ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ఉంటాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అప్పులపాలు కాకుండా ఏకగ్రీవాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్టీలకు అతీతంగా చేసుకోవాలని సూచించారు. తొర్రూరు జెడ్పీటీసీ 25 ఎకరాల భూమి, ఇళ్లు అమ్ముకోవాల్సిన పరిస్థితిలో హైదరాబాద్‌లో పని కోసం వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వకుండా చిన్న చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. పదవులు ఉంటాయి.. పోతాయి.. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజాపాలనే ధ్యేయం

చిన్నగూడూరు: ప్రజాపాలనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చిన్నగూడూరు, జయ్యారం గ్రామాలలో పర్యటించారు. జయ్యారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటారు. అనంతరం పాఠశాలలో కంప్యూటర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ఆదాం, జీవన్ పాల్గొన్నారు.

వర్ధంతి సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


కురవి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కురవి/గూడూరు/నెల్లికుదురు: అమరవీరుల స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు గజ్జి లింగన్న పిలుపునిచ్చారు. ఈనెల 4వ తేదీన ఖమ్మంలో నిర్వహించే దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె బాబన్న, యాస వెంకటనారాయణ, సామ పాపయ్య, నున్న ఉపేందర్, ధనసరి రమేష్, రియాజ్, ఫరీద్, శంకర్, లక్ష్మయ్య, శ్రీను, రమేష్, సత్తయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ప్రభుత్వ చెలగాటం


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్‌నాయక్ డిమాండ్ చేశాడు. బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మదన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టాలని లేని ఎడల ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రేమ్ రాయుడు, వెన్నమల్ల అజయ్, బాలు, సంపత్, ప్రశాంత్, నరేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్యశిబిరం

దంతాలపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ చందు అన్నారు. మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరసింగ్, వార్డెన్ ఠాగూర్, వైద్య సిబ్బంది, కళావతి, కవిత పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

తొర్రూరు: నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని బీజేవైఎం అర్బన్ అధ్యక్షుడు కాగు నవీన్ కోరారు. ఈమేరకు మంగళవారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు రాజేష్, నవీన్, విజయ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

కూరగాయల సాగు పరిశీలన

నర్సింహులపేట: మండలంలోని జయపురం, బొజ్జన్నపేట గ్రామాల్లో ఉద్యావన శాఖ అధ్వర్యంలో సాగు చేస్తున్న కూరగాయల సాగు తోటలను మంగళవారం హెచ్ఓ రాకేష్ పరిశీలించారు. రైతులకు ఇస్తున్న రాయితీలను వివరించారు.

నేడు మండల సభ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీను తెలిపారు. అధికారులు, ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఏఎన్ఎం, ఆశలకు అవగాహన సదస్సు

చిన్నగూడూరు: జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో మండలంలోని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సంకల్ప–మహిళా సాధికారత ఆధ్వర్యంలో లింగ నిర్ధారణ పరీక్షలు, లైంగిక వేధింపులు, గృహ హింస, మిషన్ శక్తి పథకం వంటి అంశాలపై ఏఎన్ఎం, ఆశలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది సౌజన్య, సంధ్య, రాణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మేఘన, దివ్య, కావ్య, కుమారి పాల్గొన్నారు.

వరి నారుమడుల పరిశీలన

నర్సింహులపేట: మండలంలోని వస్త్రాంతండాలో మంగళవారం వ్యవసాయ శాఖ ఏఈఓలు రామకృష్ణ, కరిస్మా వరి నారుమడులను పరిశీలించారు. నారుమడి తయారీపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఒక ఎకరం సాగుకు విత్తనాలు ఎంత తీసుకోవాలి, విత్తనశుద్ధి, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు వివరించారు. వరినారు మంచిగా ఎదగడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

పింఛన్లు ఇవ్వాలి

బయ్యారం: ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లు పెంచి ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాతా గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మురళీకృష్ణ, రాజేశ్, శరత్ పాల్గొన్నారు.

రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

గార్ల: సంగారెడ్డిలో ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం కరపత్రాలను ఆయన విడుదల చేశారు.

నోట్‌బుక్స్ పంపిణీ

నెల్లికుదురు: మండలంలోని పెద్దతండా, కొత్తూరు తండా, దూపతండా ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నవ యువ భారత్ ఆధ్వర్యంలో బ్లాక్ బోర్డ్‌తోపాటు ప్రతి విద్యార్థికి నోట్ బుక్స్ అందించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు బాదావత్ సురేష్ నాయక్, నవీన్, రమేష్, బాలకృష్ణ, వెంకన్న, మధుకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అవగాహన కల్పించాలి

దంతాలపల్లి: అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు ఆటపాటలతో ప్రైమరీ స్కూల్, ప్రీప్రైమరీ స్కూల్ అక్షరాలపై అవగాహన కలిపించాలని సీడీపీఓ శిరీష అన్నారు. మండలంలోని గున్నెపల్లి గ్రామ రైతువేదికలో మంగళవారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తలతో శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం..

తొర్రూరు: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామని స్థానిక ఎస్సై జగదీష్ తెలిపారు. ఆరు మాసాల క్రితం జర్నలిస్టు బోగోజు సురేష్ మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్సై రూ.5 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందించాడు. కార్యక్రమంలో అదనపు ఎస్సై రాంజీనాయక్, ఏఎస్సై రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సాయికిరణ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య ఆరోపించారు. మంగళవారం గ్రామంలో సీపీఐ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మురుగు కాల్వలో చెత్తాచెదారం పేరుకపోయిందని, కాల్వలను శుభ్రం చేయడంలేదని తెలిపారు. తాగునీరు సక్రమంగా రావడంలేదని, వీధిలైట్లు చాలా కాలనీల్లో వెలగడం లేదన్నారు. కార్యక్రమంలో నర్సింగం గురవయ్య, కందుల యాకయ్య, బొల్లు వెంకన్న, నల్లు మధుసూదన్‌రెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

విప్లవకవి చెరబండ రాజు

నెహ్రూసెంటర్: తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పాటు చేసుకున్న విప్లవకవి చెరబండరాజు అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం రాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యం, భాస్కర్‌రెడ్డి, రంగయ్య, సురేష్, సంతోష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల కేంద్రంలోని సాధికారత మండల సమైక్య ఆఫీసులో మంగళవారం ఐకేపీ వీఓఏల సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భుక్యా నెహ్రూ నాయక్, కార్యదర్శిగా రేసు రాధా, కోశాధికారిగా అనసూయ, ఉపాధ్యక్షుడిగా రమేష్‌నాయక్, సహాయ కార్యదర్శులు సునీత, వెంకటేశ్వర్లు, రవి, లావణ్య, సుహాసిని, సలహాదారుడిగా సాంబయ్య ఎన్నికయ్యారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

కేసముద్రం: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ధన్నసరి, కేసముద్రం పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతుల సలహాలు, సూచనల కోసం ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, చైర్మన్ వెంకన్న, అల్లం నాగేశ్వర్‌రావు, ఏఓ వెంకన్న, సీఈఓలు వెంకటాచలం, మల్లారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

తొర్రూరు: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. మంగళవారం కార్యకర్తల సమావేశంలో రవి మాట్లాడుతూ.. సమస్యపై ఈ నెల 5న కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట, 11న పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాలను నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడ్య బీకు, మండల అధ్యక్షుడు సోమనర్సయ్య పాల్గొన్నారు.